# 31. నే చూడని వ్యక్తి

బుర్ర వొంచుకొని ఆఫీసులో పని చేసుకుంటున్నాను. వాతావరణమంతా నిశ్శబ్దంగా ఉండటంవల్ల ఎంతో భారంగా ఉన్నట్టు తోస్తోంది. గడియారం నాలుగు గంటలు కొట్టిన శబ్దం వినిపించి, ఇంకో గంటలోనే పద్దాంకదా అని ఒక విధమైన 'రిలీఫ్' వొచ్చింది. కాని యీ గంట సేపుకూడా యాంత్రికంగా పనిచేయాలే అనే బాధకూడా మరో వైపు తరుముతూనే వుంది.

నా పక్కగదిలో నాగేశ్వరరావు ఉన్నాడు. వాడికీ నాకూ మధ్య ప్లైయ్‌వుడ్‌తో అమర్చిన చెక్కకూర్పే అడ్డం. ఎవరో వ్యక్తి హడావిడిగా ఉప్పెనల్లే గదిలో ప్రవేశించిన శబ్దం నాకు పరాకు చెప్పింది. ఆ ప్రవేశించింది నా గదిలోకి మాత్రం కాదని తెలుసుకున్నాను. కాని ఆ ప్రవేశించిన తీరులో ఎంతో ఆతృత, తొక్కిపెట్టబడ్డ ఆవేదనా మిళితమైవున్న వనే సంగతి చెవులకు మాత్రం తెలుస్తూనే వుంది.

ఆ కొత్త గొంతు మాట్లాడటం మొదలు పెట్టింది. కంఠస్వరం ఖంగుమంటూ వుంది. అంతేకాదు – ఆ చెప్పేది ఒక్క వ్యక్తికే కాదనీ, అనేక వందల ప్రేక్షక జనంలో మాట్లాడాల్సినంత పెద్దగా వుందనికూడా తెలుసు. ఐతే ఆ కంఠస్వరం కేవలం ఒక్క వ్యక్తితోనే మాట్లాడుతూ వుంది. దాని లక్ష్యం ఆఫీసులోని మిగతా వ్యక్తులు కూడా వినాలని.

"విన్నారా?...నారాయణరావు పెళ్ళాం లేచిపోయింది!...."

నా పక్కగదిలో నుంచే ఈ మాటలు వినిపించినవి. ఐతే నాగేశ్వరరావు కంఠస్వరం వినిపించలేదు. ఆ లేచిపోయినామె సంగతి నాగేశ్వరరావు ఎందుకు అడగడో నాకు

అర్థంకాలేదు. ఇంకా అడగడేమో అని నాకు ఆతృతగా వుంది. ఆఫీసు పని నుంచి మనస్సు తెంచుకొని బైటపడ్డది. కలం టేబిల్ మీద విసిరి పారేశాను. చెవులు రిక్కించుకొని సంభాషణకోసం వేచి కూర్చున్నాను.

నిజానికి నారాయణరావు ఎవరో నాకు తెలియదు. అతని భార్యను ఎప్పుడూ చూచివుండను. ఐతేమాత్రమేం– అతని భార్య లేచిపోయింది. భార్యలచేత విడవబడ్డ భర్తల్లో నారాయణరావు ఒకడు. అంతవరకూ తెలుస్తేచాలు. ఐతే నారాయణరావును గూర్చి వినాలనే ఇష్టత నాకేమీలేదు. లేచిపోయిన అతని భార్య విషయమే నాకు కావాలి.

నాగేశ్వరరావు గదిలో నిశ్శబ్దత ఎక్కువైంది. నాగేశ్వరరావు మిగతా విషయాలను గుచ్చిగుచ్చి అడగనందుకు అతని మీద నాకెంతో కోపం కూడా వచ్చింది...ఐతే, నాగేశ్వరరావు ప్రశ్న వేయవలసినంత అగత్యం లేకుండానే అతని, కంఠం ఆలిండియా రేడియోలాగు ఘుం అని లేచింది.

"ఈ వార్త మధ్యాహ్నానికల్లా నాకు తెలిసింది. అసలు ఈ గొడవంతా మొట్టమొదట కనిపెట్టింది నేనే! బహుశా రాత్రి మెయిల్‌లో మెడ్రాస్ వెళ్ళివుంటారు."

మళ్ళీ ఆగాడు. తన మాటలు వినిపించినంత ప్రదేశంలోవున్న శ్రోతలు యింత వరకూ జీర్ణించుకునేందుకేమో! ఇంత తేలిక పదార్థం, ఎంతో వినోదాన్నిచ్చే ఈ కర్ణోపేతమైన వార్త ఎవరికైనా ఇట్టే జీర్ణమౌతుందని అతనికి తెలియదనుకుంటాను. ఏమైనా ఇంతటితో సంభాషణ ఆగిపోయిందేమోనని నా గుండెల్లో రాయి పడ్డది. కాని నా గుండెల్లో పడ్డరాయి ఎక్కువసేపు వుండకుండానే వెంటనే అతని కంఠధ్వనికి అదిరి ఆమడ దూరాన పడి ఉంటుంది.

"నా అనుమానం వరదరాజులు మీద. రోజూ వాళ్ళింటికి వెళ్తూండేవాడు. నారాయణరావు లేని సమయాల్లో భార్యను మచ్చిక చేసుకొని ఉంటాడు. అసలు ఆమెకు మొగుడంటే ఇష్టంలేదులే! పోతే వరదరాజులికి తప్ప ఇంకెవ్వరికీ ఆ ఛాన్సు లేదు. ఏమైతేనేం – అతను అదృష్టవంతుడు. పదివేల రొఖ్ఖంతోనూ, అందమైన అమ్మాయి దొరకటం అంటే మాటలా?"

కళ్ళు మూసుకొని ఆలోచిస్తున్నాను. ఆ మాటలు విని ఆ నాయకిని నా ఊహాపథంలోకి తీసుకు రాగలిగాను. అంత అదృష్టం నాకు పొరపాటు నన్నాపడితే!...నిజంగా ఆ నాయకుణ్ణి నేనేనని అనుకొని కొంచెంసేపు తృప్తి పడ్డాను. నాకు అలాటి అవకాశం ఉందని కాదుగాని, ఆ ఊహ ఎంతో ఆనందాన్ని ఇస్తుందని! నారాయణరావు భార్య గొడవకూడా నాకు పట్టలేదు...ఆమె లేచిపోయిందే – ఆ వరదరాజులు – వాడి గొడవే! వాణ్ణి నేను కలలో కూడా చూసి ఉండను. ఐతేనేం – వాడి మీద నాకెంతో యీర్ష్యగా వుంది. వాడు నాకు ఆజన్మశత్రువుల్లో మొదటివాడు!

పోతే, ఇంతకుముందే ఈ వార్తను కష్టపడి మోసుకొచ్చి యీ ఆఫీసుకున్న 108 మెట్లనూ ఎక్కి ఇక్కడ ఆ సరుకును విడుదలచేసిన మహానుభావుడు ఎవరో కాని – ఆ మాటల వల్ల నాకు ఎంత ఆనందం కలిగింది. అవి విన్నవాళ్ళందరికీ కూడా ఎంతో రిలీఫ్‌ను ఇచ్చి వుంటవనే నా నమ్మకం. ఆ లేచిపోయింది వినేవాడి భార్య కానంత వరకూ, శ్రోత ఆనందానికి మేర వుంటుందని నేను అనుకోను. ఆ లేచిపోయింది నాతో కాకుండా ఆ వరదరాజులు గాడితో (వాడొట్టి నాపయి వుంటాడని నాకో గుడ్డి నమ్మకం కుదిరింది!) ఐనందుకు అంతులేని దుఃఖం కూడా వొచ్చింది.

ఏమో – నాకూ అలాటి ఛాన్సు దొరుకుతుందేమో! ఎవరు చెప్పగలరూ? యీ మహాత్ముడు కనీసం ఇలాటి నా 'ఆశ'కు గట్టి పునాదివేశాడు.

అవతలి గదిలోనుంచి మాటలు వినిపించటం లేదు. ఇంకా చెప్తాడు, ఇంకా చెప్తాడని కూర్చున్నాను. పది నిమిషాలు గడిచాక నిరాశ చేసుకున్నాను. వాణ్ని చూసివుంటే వాడి వెంటపడి, వాడికి కాఫీ పోయించన్నా పరిచయం చేసుకున్నట్టయితే బాగుండేదనిపించింది...ఒకవేళ ఇంకా ఉన్నాడేమోననే గుడ్డి ఆశ కూడా లేకపోలేదు. మనిషిని చూద్దామని నాగేశ్వరరావు గదిలోకి తొంగిచూశాను.

నాగేశ్వరరావు "ఏం?" అన్నాడు సీరియస్‌గా.

ఇదంతా చెప్పటం ఇష్టంలేక "ఏం లేదు" అని తప్పుకున్నాను.

మర్నాడు సరిగ్గా నాలుగు గంటల కల్లా నిన్నటిలాగే పెనుతుఫానల్లే 'వాడు' వొచ్చిపడ్డాడు,

"విన్నారా?" అనే కంఠస్వరం నేను విన్నాకనే, మా వార్తాహరుడు దూకాడనే కొత్త ఆనందం, 'రిలీఫ్' కలిగింది.

"ఆ దాసులేడూ – వాడి చెల్లెలు...ఇంటర్ చదువుతోందే – అది, వాళ్ళ ఇంట్లో కుట్టుమెషిన్ పెట్టుకున్న సాయిబును తీసుకొని వెళ్ళిపోయింది!"

యీ పాడు ఉద్యోగం నా మెడకు పడ్డదికాని, కుట్టుమెషిన్ పెట్టుకొని ఆ దాసుగాడి ఇంట్లో జేరినా బాగుపడేవాణ్ణి. ఎంత దురదృష్టవంతుణ్ని!

"పెద్ద చదువు చదువుకుంది కదా – సంస్కారమూ, చదువు సంధ్యలులేని ఆ వెధవతో లేచిపోవట మేమిటండీ.– అసలు యీ ఆడవాళ్ళకు బుద్ధి ఉందంటారా?"

ఆడవాళ్ళకు బుద్ధిలేదని కనిపెట్టిన మొగాళ్ళల్లో ఇతనొకడు. ఐతే వాళ్ళకు బుద్ధివుంటే – ఆడవాళ్ళు మొగాళ్ళతో లేచిపొయ్యేందుకు మారుగా, మొగాళ్ళనే ఆడవాళ్ళు లేపుకొనిపోవటం జరిగేదేమో! అలా ఐతే యీ మొగ పురుగులు అసలే బతకలేరనే విషయాన్ని 'వీడు' ఆలోచించలేదల్లేవుంది!

ఇంకేం చెప్తాడోనని కూర్చున్నాను. నిన్నటి సంభాషణనుబట్టి (దాన్ని సంభాషణ అనటం పొరపాటు. యెందుకంటే ఇద్దరు మనుషులున్నా మాట్లాడేది ఒక్కడే! అవతలి మనిషిని మాట్లాడనిచ్చేరకం కాదు. అసలు ఆ మాట్లాడాల్సిన అవసరం కూడా కనిపించదు ఎందుకంటే గ్రామఫోన్ ప్లేటల్లే అంతా వాడే వాగేస్తాడాయె!) చరిత్ర అంతా క్లుప్తంగా కక్కేసికాని వెళ్ళడని తెలుసు. ఇలాటి వ్యక్తులున్నచోట్ల స్థానిక పత్రికలు నిజంగా ఎంతో అనవసరం!

"నాకు మొదటినుంచీ అనుమానం గానే ఉందండీ. ఈడొచ్చిన పిల్ల యింట్లో ఉందాయె...... అందంగావుండే ....అరుగుమీద మెషెన్ పెట్టె వాడితో మాట్లాడుతూంటే ఎవరికి అనుమానం వుంటుందీ! ఆ అమ్మాయికి ఇష్టంలేని సంబంధాన్ని అంటగట్టాలని పెద్దవాళ్ళు ఆలోచిస్తుండగా యీ కాస్తపనీ చేసిపారేసింది...క్షణక్షణముల్ జవరాంధ్ర చిత్తముల్!...." రాగాలాపన ప్రారంభించాడు. బ్యాక్ గ్రౌండ్ లేనందువల్ల కర్ణకఠోరంగా వుంది. ఆ ఏడిసేది వచనంలో ఏడవమని అరుద్దామనుకున్నాను. కాని హఠాత్తుగా రాగం ఆగిపోయింది. కనుక నన్ను నేను తమాయించుకోగలిగాను.

ఏ క్షణానికి ఆ క్షణం వాణ్ని చూద్దామనే వుంది. కాని, వాడు వుండగా గదిలోకి జొరబడితే నన్ను చూసి బెదిరి కథను ఆపుతాడేమోననే భయంతో ఊరుకున్నాను. అసలు వీడు ఎవరైనా, యీ లేచిపోయినవాళ్ళ చరిత్ర పరిశోధకుడే ఐనా – లేచిపొయ్యాక జేరవేసే ఇలాటి వార్తలకన్నా, లేచిపోతారనే అనుమానం వున్నవాళ్ళ గైడ్ (లేక డైరెక్టరీ) వొకటి నా మొహాన తగలేస్తే నాకు, ఆ లేచిపోదల్చుకున్న వాళ్ళల్లో ఒక్కతెకూ (లేచిపొయ్యే పక్షంలో ఒక్కతే చాలు. అంతకన్న ఎక్కువమందిని నా మీదికి తోలితే నేను నిభాయించుకోలేను. అది నాకూ, వాళ్ళక్కూడా అంత శ్రేయస్కరకం కాదు!) ఎంతో మేలు చేసి, ఇంత సాంఘికసేవను చేసిన వాడౌతాడు. కనుక వీడి పరిచయం నాకు ఎంతో ముఖ్యం.

...వాణ్ని చూద్దామని నిశ్చయం చేసుకునే వేళకు వాడు జారిపొయ్యాడు. ఇలాటి వింతప్రచారకులు చేతులో ఉండటంవల్ల ముందుముందు ఎన్నో లాభాలు ఉన్నవని నా నమ్మకం. ఏం చెయ్యనూ – ఇవాళ కూడా వాడు దూసుకుపొయ్యాడాయె!

మర్నాడన్నా తప్పక చూచితీరాలనే నిశ్చయంతో కూర్చున్నాను. నాలుగు గంటలు కొట్టినప్పటినుంచీ నా ఆతృత ఎక్కువైంది. నిమిషనిమిషానికీ వాణ్ని 'ఎక్స్‌పెక్ట్' చేస్తూనే ఉన్నాను. ఆఫీస్ టైం అయిపోయినా, వాడు రాలేదు. యీ గంటసేపూ, పని చెయ్యకుండా కూర్చున్నందుకు, రాత్రికి రెండుగంటల పని మీదపడ్డది. వాడు రానందుకు నాకు ఎంతో నిరాశ కలిగింది. వాడిమీద కోపం కూడా వొచ్చింది.

ఆ నాటినుంచీ వారం రోజులవరకూ కళ్ళు కాయలు కాచేట్టు వాడి కోసం ఎదురుచూశాను. అసలు బతికి ఉన్నాడో, లేక ధామ్మిన చచ్చాడో కూడా అగమ్య గోచరంగా వుంది. ఇక ఉండబట్టలేక నాగేశ్వరరావును అడిగాను.

"అతను రావటంలేదేం?"

"ఎవడ్రా?"

"సాయింత్రం నాలుగింటికల్లా నీకు తాజావార్తల్ని మోసుకొచ్చేవాడే...!"

నాగేశ్వరరావు నవ్వి "వాడా? కామిగాడు!" అన్నాడు.

"ఆం. ఏమయ్యాడూ?"

"ఉన్నాడు. కొత్త కాతాదారుల్ని పట్టివుంటాడు. వాణ్ని గూర్చి వినాలని వుందా?"

"చాలా!"

"వాడి అన్న ఒక కవి. అతన్ని కామయ్య అన్న అని ఎవరూ అనరు కాని, వీణ్ని మాత్రం 'కవి తమ్ముడు' అంటారట! వీడూ ఏవో కాకమ్మకథలు గీకుతాడు. పద్యాలూ, గేయాలూ, టుమ్రీలూ కూడా రాస్తాడు. రాయగలనని అనుకుంటాడు. కాని అవ్వి ప్రచురించబడవు. అందుకని ఆ కథలకు ప్రచారం కలిగేందుకు, శాంపిల్‌గా ఒక్కోడికి రెండో మూడో వినిపిస్తుంటాడు."

"ఐతే నీతో చెప్పినవన్నీ కట్టుకథలా?"

"కాక? నిజమో అబద్ధమో మనం ఎక్కడ విచారిస్తాం? రోజుకొకత్తె వంతున వీడికోసం లేచిపోతూంటుందా?"

"వీడు నీకెట్లా తగిలాడూ?"

"రోడ్డున పొయ్యే ప్రతివాడితోనూ ఏదో విధంగా పలకరించి పరిచయం చేసుకుంటాడు. కాస్త మొహం తెలుస్తే చాలు...ఇక తగులుకొని కథలు చెప్తాడు. ఊళ్ళో రోడ్లన్నీ వాడివే! వీడికి స్వంత పనులనేవి ఉండవు కనుక, ఇతరులకు కథలు వినిపించే పని పెట్టుకున్నాడు."

"ఇల్లూ వాకిలీ, పెళ్లాం బిడ్డలు-"

"ఆస్తేమీ లేదు. ఒక బోషాణ్ణానికి సరిపడే రచనల దస్తరాలు మాత్రం ఉన్నవి. కాస్త అలుసిస్తే, ఇంటికి తీసుకువెళ్ళి ఆ కట్టలన్నీ ఇచ్చి చదవమంటాడు. నా అదృష్టం బాగుండి వొదిలిపొయ్యాడు కాని..."

కాస్త ఆగి, నాగేశ్వరరావు మళ్ళీ చెప్పటం మొదలుపెట్టాడు: "ప్రతిరోజూ భోజనహోటల్‌లో తటస్థపడేవాడు. ఈ వూరివాడు ఎందుకా హోటల్‌లో భోం చేస్తాడని

అనుమానం వేసి అడిగాను. వాడి మొహం నల్లబడ్డది. ఆ సాయంత్రంనుంచే నాకు లేచిపోయినవాళ్ల కథలు చెప్పటం మొదలుపెట్టాడు."

"వాడికేం లాభం?"

"విను మరి. ప్రతి కథలోనూ మొగాడి తప్పు లేకండానే ఆడది లేచి పోతుంది. ఇలా సరిపోలే కథలే చెప్తాడేమో అని ఆలోచించేవాణ్ని. ఒక రోజు, ఒక మిత్రుడు కనిపించి వీడి సోది చెప్పాడు. వీడు పెళ్ళాన్ని వొదిలాడో, లేక పెళ్లామో వీణ్ని వొదిలేసిందో చెప్పటం బ్రహ్మక్కూడా సాధ్యం కానిది. ఏమైనా ఆమె వొదిలేసిందనే బహుజనాభిప్రాయం.... ఆ మాట ఎవరైనా తనను అడుగుతారేమోనని వాడి గుండెల్లో దడదడ. అందుకని లేచిపోయిన వాళ్ళ కథలు ముందుగా తనే చెప్పటం మొదలుపెడతాడు. తన ఒక్కడి భార్యే కాకుండా, లోకంలో అనేక మంది భార్యలు లేచిపొయ్యారని శ్రోత అనుకోవాలి. అంటే ఆ గుంపులో, తనకు తోడుగా అనేకమంది వున్నందువల్ల, తనకు ఒకరకమైన సానుభూతి వుంటుందని ఆ పక్షిగాడి నమ్మకం. కాని ఆడ లేక మద్దెల ఓడు అన్న సామెత ఎవరికి తెలియదు!"

నాకు ఆశ్చర్యం వేసింది. వాడంటే ఎంతో అసహ్యం కలిగింది. ఈసారి కనిపిస్తే వీపు ఇస్త్రీ చేద్దామని కూడా వుంది.

కామయ్యను నేను ఇంతవరకూ చూడలేదు. వాణ్ని చూడాలనిలేదు, కాని ఏదో వొక రోజున నా వెంట పడకమానడు. అయితే వాడు మాట్లాడటం మొదలుపెట్టిన క్షణానే నేను వాణ్ని గుర్తించగలను. అంటే వాణ్ని చూడకపోయినా, బాగా ఎరుగుదునన్న మాట! కనుక నేను తగు జాగర్తలో ఉండగలననే నమ్మకం నాకు వుంది!